# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. మన్ కీ బాత్ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్‌కు దోహదపడుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
2. యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు
3. డెన్మార్క్, బెల్జియం దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్ కు నేరుగా విమాన సర్వీసులు నడిచేలా ప్రణాళికలను రూపొందిస్తున్నానని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
4. తెలంగాణ గవర్నర్ కార్యాలయం 2024 సంవత్సరానికి గానూ ‘గవర్నర్ ప్రతిభా పురస్కారాలకు 8 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది.
5. సుదీర్ఘ తీర ప్రాంత కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులు కీలక పాత్ర పోషిస్తాయని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి అన్నారు.

=========================

మన్ కీ బాత్ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్‌కు దోహదపడుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఏటికొప్పాక బొమ్మల గురించి ప్రస్తావించడం ద్వారా 6 వందల సంవత్సరాల నాటి ఈ కళకు మరింత ప్రాచుర్యం పెరిగిందన్నారు. ఇది వేలాదిమందికి జీవనోపాధిని కల్పించడంతోపాటు.. విలువైన ప్రాచీన సాంప్రదాయాన్ని సంరక్షించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఏటికొప్పాక ఆటబొమ్మల పురోగతిపై ఒక వీడియో సందేశాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు.

-------------------------

యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ఆయన నిన్న జ్యూరిచ్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, యువత ఎప్పుడూ భవిష్యత్ దిశగా ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ కృత్రిమ మేధ ఏఐ, చాట్ జీపీటీ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో అవకాశాలు ఉన్న ప్రతిచోట తెలుగువారుంటారని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..32 సెకన్లు.

---------------------------

డెన్మార్క్, బెల్జియం దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్ కు నేరుగా విమాన సర్వీసులు నడిచేలా ప్రణాళికలను రూపొందిస్తున్నానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. జ్యూరిచ్‌లో పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ,

వాయిస్ ..26 సెకన్లు

మరోవైపు ఇదే సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని సానుకూల పరిస్థితులున్నాయని తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక విధానాల ద్వారా రిలయన్స్, ఎన్టీపీసీ, టాటా లాంటి పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగ మేళాను మంత్రి నిన్న ప్రారంభించి.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు.

---------------------------

రహదారి ప్రమాదాల నివారణకు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అలవర్చుకోవాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ నాచారంలోని ఒక పాఠశాలలో చిల్డ్రన్ ట్రాఫిక్ అవగాహన పార్క్‌ను నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు రహదారి భద్రతా నియమాలను తెలుసుకునేలా ఈ పార్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు స్క్రాప్ పాలసీ తెచ్చామని చెప్పారు. పాఠ్య పుస్తకాలలో ట్రాఫిక్ అవేర్నెస్‌ను ఒక పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

సుదీర్ఘ తీర ప్రాంత కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో పోర్టులు కీలక పాత్ర పోషిస్తాయని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీ మారిటైమ్ బోర్డు కార్యాలయంలో పోర్టుల అభివృద్ధి – పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 6 మత్స్య నిలవ కేంద్రాల కోసం టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. 'ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్' ఈపీసీ విధానంలో చేపట్టిన పోర్టులు, పిషింగ్ హార్బర్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణ గవర్నర్ కార్యాలయం 2024 సంవత్సరానికి గానూ 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలను నిన్న ప్రకటించింది. ఈ అవార్డులకు 8 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

కాగా .. ఈ నెల 26 వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ అవార్డు కింద 2 లక్షల రూపాయలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు.

----------------------------

చట్టసభల కార్యకలాపాలు, సభాపతులు, సభ్యులు, సభకు ఉన్న ప్రత్యేక అధికారాలను అందరూ గౌరవించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బీహార్‌లోని పట్నాలో నిన్న జరిగిన 85వ అఖిల భారత సభాపతుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'రాజ్యాంగ విలువలను సుసంపన్నం చేయడంలో చట్టసభల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. శాసన వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర ప్రతిపత్తిని గౌరవించాలన్నారు. శాసన వ్యవస్థ కార్యకలాపాల్లో కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం చేసుకోవడమనేది రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని ఉల్లంఘించడమేని చెప్పారు. 100 మందికి పైగా సభ్యులుండే చట్టసభలు ఏడాదిలో కనీసం 75 రోజులు సమావేశాలు నిర్వహించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.

----------------------------

తెలంగాణలోని ధర్మపురి ఆలయ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తామని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు జి.వంశీకృష్ణ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో 15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఎంపీ నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమృత్ పథకం కింద 2 కోట్ల రూపాయలను కేటాయించామని తెలిపారు.అలాగే ధర్మపురి కరకట్ట నిర్మాణం గురించి కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్తానని వంశీకృష్ణ పేర్కొన్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పులికాట్ సరస్సు పూడికతీతకు 100 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ముగింపు కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పరిశ్రమగా గుర్తించిందని, ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందని మంత్రి వివరించారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం చేపట్టిన 'ఉద్యం' రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో యంఎస్ యంఈ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔత్సాహికులకు నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు, సేవల కార్యకలాపాలపై శిక్షణ ఇవ్వడానికి తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని చెప్పారు.

=====================